సాక్షి ములుగు

మంగళవారం । 18 ఫిబ్రవరి । 2025



పోడు భూముల్లో సౌర వెలుగులు

సాగుకు యోగ్యంగా లేని పోడు భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాయి.

- 8లో▸



ఆన్‌లైన్..ఆగమాగం!

రైల్వేశాఖలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల కనీస హక్కులను ఆన్‌లైన్ చేయడంతో రైల్వే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0°/19.1°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామప్పను సందర్శించిన ఇంగ్లండ్ దేశస్తులు



వెంకటాపురం(ఎం): రామప్ప దేవాలయాన్ని సోమవారం ఇంగ్లండ్‌కు చెందిన థామస్, జాన్ సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని వారు దర్శించుకోగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టతను రాష్ట్ర టూరిజం గైడ్ మధు వివరించారు. రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ అంటూ కొనియాడారు.

క్రీడల్లో మైనార్టీ గురుకుల విద్యార్థుల ప్రతిభ



ములుగు రూరల్ : మండలంలోని దేవగిరిపట్నంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ములుగు అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రావ్య షార్ట్ పుట్‌లో ప్రథమ స్థానం సాధించగా, 7వ తరగతి చదువుతున్న నవ్య ద్వితీయ స్థానం, 8వ తరగతి చదువుతున్న ఆకాంక్ష జావెలిన్ త్రో లో ప్రథమస్థానం, 8వ తరతగతి చదువుతున్న రిజ్వాన డిస్క్ త్రో లో ప్రథమ స్థానం, 9వ తరగతి చదువుతున్న కీర్తనలాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పీఈటీ స్వప్నను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పోరాటాలతోనే జిల్లా ఏర్పాటు



ములుగు : విద్యార్థులతో మొదలైన పోరాటానికి అన్ని వర్గాలు సంపూర్ణంగా సహకరించడంతోనే ములుగు జిల్లా ఏర్పాటు సాధ్యమైందని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుకున్నారు. ఈ సందర్భంగా భిక్షపతిగౌడ్ హాజరై విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనరంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యమంలో భాగంగా ఎన్నో పోరాటాలు చేసి అనేక మంది కేసుల పాలయ్యారని గుర్తు చేశారు. మల్లంపల్లి మండలం, గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు, ములుగు మునిసిపాలిటీ, ఆర్టీసీ బస్‌డిపో, మోడల్ బస్టాండ్ అన్నింటిని పోరాటాలతోనే సాధించుకున్నామని అన్నారు. కార్యక్రమంలో నూనె శ్రీనివాస్, గుండమీది వెంకటేశ్వర్లు, పల్లెర్ల సతీశ్, మొగిలిచర్ల రమేశ్, కలువల సంజీవ, కాకి రవిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ తనిఖీ

మంగపేట: మండలంలోని వాడగూడెంలోని పట్టా భూముల్లో ఇసుక మేటల తరలింపులో భాగంగా కొనసాగుతున్న ఇసుక క్వారీని ములుగు ఓఎస్డీ మహేష్ భగవత్ గీతె , ఏటూరునాగారం ఏఎస్పీ శివ ఉపాధ్యాయ సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక క్వారీల్లో అక్రమ రవాణా, నిబంధనలకు విరుద్ధంగా అదనపు లోడుతో ఇసుక తరలింపును నియంత్రించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు క్వారీలో తనిఖీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఇసుక క్వారీ నుంచి ఇసుక తరలింపుపై తనఖీలు నిర్వహించి అక్రమంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్య తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం ప్రభుత్వ నిబంధనలకు బోరునర్సాపురం ఇసుక క్వారీ నుంచి అదనపు లోడుతో వెళ్తున్న ఐదు లారీలను కమలాపురం వే బ్రిడ్జి వద్ద పోలీసులు గుర్తించి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వెంట ఎస్సై టీవీఆర్ సూరి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

వాజేడు : అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లపై సోమ వారం కేసు నమోదు చేసినట్లు పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని బీమారం, రాంపురం, ఇసుక ర్యాంపులను తన సిబ్బందితో కలిసి తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో తూనూరు చంటి, దాసరి రామయ్య, కాకర్ల పూడి ప్రవీణ్‌లు ఇసుక తరలిస్తుండగా స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొలువులకు కోత!

ప్రమోషన్ల కోసం పోస్టుల కుదింపు

- టీజీ ఎన్పీడీసీఎల్ తీరుతో నిరుద్యోగుల అవకాశాలకు గండి
- సబ్‌స్టేషన్‌లలో ఆపరేటర్లు కరువు
- గ్రామాల్లో జూనియర్ లైన్‌మెన్ల కొరత
- క్షేత్రస్థాయిలో వినియోగదారులకు ఇబ్బందులు
- పని భారంతో ఏఅండ్‌ఎం ఉద్యోగుల అవస్థలు



హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెబుతుండగా.. మరో వైపు ప్రభుత్వ రంగ సంస్థ టీజీ ఎన్పీడీసీఎల్ ఇంజనీర్ల పదోన్నతుల కోసం వర్క్‌మెన్ పోస్టులకు కోత పెట్టి నిరుద్యోగుల అవకాశాలను కొల్లగొడుతున్నదనే అపవాదును మూటగట్టుకుంటోంది. వర్క్‌మెన్ పోస్టులను తగ్గించి వాటిని ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించేందుకు ఉన్నత స్థాయి పోస్టులు సృష్టించడంపై క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించినా ఆ మేరకు ఆపరేటర్లను నియమించకపోవడంతో అందుబాటులో ఉన్న ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ ఉద్యోగులపై భారం పడుతోందనే వాదన వినిపిస్తోంది. కొన్ని సబ్‌స్టేషన్లలో రిటైర్డ్ ఉద్యోగులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తూ నిర్వహణను నెట్టుకొస్తున్నారే తప్ప సబ్‌స్టేషన్ ఆపరేటర్ల నియామకంపై యాజమాన్యం దృష్టి సారించడం లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు.

23 నెలల క్రితం నోటిఫికేషన్

టీజీ ఎన్పీడీసీఎల్‌లో 932 పోస్టులు ఖాళీగా ఉండగా 23 నెలల క్రితం 100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి ఇటీవల 93 పోస్టులు భర్తీ చేశారు. మిగతా 839 పోస్టులు భర్తీ చేయలేదు. వాటిలో 200 పోస్టులకు కోత పెట్టి ఉన్నతస్థాయి పోస్టులుగా సృష్టించి ప్రభుత్వ ఆమోదానికి పంపినట్లు సమాచారం. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో సిబ్బంది లేక.. ఉన్న ఉద్యోగులపై పని భారం పడుతున్నా జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు భర్తీ చేయకుండా అధికారులు కాలయాపన చేస్తుండడంతో నిరుద్యోగులు ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారు.

339 కొత్త పోస్టుల స్థిరీకరణ

కొన్నేళ్లుగా వృథాగా ఉన్న 215 అన్ యూజ్డ్ పోస్టులతో పాటు ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టుల్లో 200 కలిపి మొత్తం 415 పోస్టుల స్థానంలో కొత్తగా 339 పోస్టులు స్థిరీకరించారు. అందులో చీఫ్ ఇంజనీర్, సీజీఎం(అకౌంట్స్), జాయింట్ సెక్రటరీ(పీఅండ్‌జీ), జనరల్ మేనేజర్ (పీఅండ్‌జీ), అకౌంట్స్ ఆఫీసర్ ఒక్కో పోస్టు చొప్పున, ఎస్ఈ, డీఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, వాచ్‌మెన్ పోస్టులు నాలుగు చొప్పున, రెండు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఆరు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్ పోస్టులు 16 చొప్పున, జూనియల్ అకౌంట్స్ ఆఫీసర్ 20, సీనియర్ అసిస్టెంట్ 88, సీనియర్‌లైన్ ఇన్‌స్పెక్టర్ 32, అసిస్టెంట్ లైన్‌మెన్ 48, ఆఫీస్ సబార్డినేట్ 88, స్వీపర్ పోస్టులు ఆరు మార్చినట్లు సమాచారం.

వంతుల వారీగా విధులు..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నాటికి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు 994 ఉండగా ప్రస్తుతం 1,511కు పెరిగింది. విద్యుత్ సర్వీసులు 48,17,575 ఉండగా 68,51,012కు పెరిగాయి. ఈ లెక్కన 517 సబ్‌స్టేషన్‌లు, 20,33,437 సర్వీసులు పెరిగాయి. అయితే.. విద్యుత్ వినియోగదారులకు సేవలందించేందుకు అవసరమైన సిబ్బంది, ఉద్యోగుల నియామకంపై దృష్టి సారించలేదు. ప్రతీ సబ్‌స్టేషన్‌కు కనీసం నలుగురు ఆపరేటర్లు అవసరం. ఈ లెక్కన కొత్తగా నిర్మించిన 517 సబ్‌స్టేషన్‌లకు 2,068 మంది అవసరం. అన్ యూజ్‌డ్ పోస్టుల స్థానంలో సృష్టించిన కొత్త పోస్టుల్లోనూ సబ్‌స్టేషన్ ఆపరేటర్లను మరిచారు. దీనికి తోడు గతంలో పని చేసిన ఆపరేటర్లు రిటైర్డ్ అవుతుండడంతో ప్రతి నెలా ఖాళీలు ఏర్పడుతున్నాయి. దీంతో జేఎల్‌ఎంలు, ఏఎల్‌ఎంలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు వంతుల వారీగా ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు జూనియర్ లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ అటెండ్ చేసే వారు కరువయ్యారు. గ్రామాల్లో జూనియర్ లైన్‌మెన్లు లేక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వినియోగదారులకు నేరుగా సేవలందించే వారి పోస్టుల భర్తీపై దృష్టి సారించాలని పలువురు కోరారు.

వృథాగా 215 పోస్టులు

ఎన్పీడీసీఎల్ సంస్థలో గన్‌మ్యాన్, టెలిఫోన్ బాయి, కార్పెంటర్, సివిల్ మేస్త్రీ, స్టోర్ కీపర్, టెలిఫోన్ ఇన్‌స్పెక్టర్, టెలిఫోన్ ఆపరేటర్, టూల్ కీపర్ వంటి 215 పోస్టులు ఎన్నో ఏళ్లుగా వృథాగా ఉంటున్నాయి. వీటిని క్షేత్ర స్థాయి వర్క్‌మెన్ పోస్టులుగా మార్చాలని విద్యుత్ ఉద్యోగ సంఘాలు మూడేళ్లుగా డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ఇదే అదనుగా పదోన్నతుల కోసం ఇంజనీర్లు ఇందులో ప్రవేశించి తమకు కొన్ని పోస్టులు ఇవ్వాలని పట్టుబట్టారు. అయితే.. ఈ పోస్టులకు చెల్లించే జీతాల మొత్తం ప్రతిపాదిత పోస్టుల మొత్తానికయ్యే జీతాలకు సరిపోక యాజమాన్యం దృష్టి.. భర్తీ కాకుండా ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులపై పడింది.

పదోన్నతుల కోసం కాదు..



అన్ యూజ్డ్ పోస్టులను ఇతర పోస్టులుగా మార్చడం పదోన్నతుల కోసం కాదు. ఎన్పీడీసీఎల్ పరిధి రిమోట్ ఏరియాలో కొత్తగా సెక్షన్లు పెంచాల్సిన అవసరం ఉంది. ములుగు సర్కిల్ ఏర్పాటు చేస్తున్నాం. మరికొన్ని డివిజన్లు, సబ్ డివిజన్లు కొత్తగా ఏర్పాటు చేస్తున్నాం. ఈ కార్యాలయాల్లో పోస్టుల భర్తీకి, వినియోగంలో లేని పోస్టులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందించాం. వినియోగదారులకు సేవలు అందించేందుకు, అడ్మినిస్ట్రేషన్ అవసరాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాం. త్వరలో జేఎల్‌ఎం పోస్టులు భర్తీ చేయనున్నం. ఈ నియామకాలతో సబ్‌స్టేషన్ ఆపరేటర్ల కొరత తీరుతుంది.

- కర్నాటి వరుణ్‌రెడ్డి, సీఎండీ ఎన్పీడీసీఎల్

కొనసాగుతున్న మొక్కులు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ముగిసి రెండు రోజులైనా మేడారానికి భక్తుల రాక కొనసాగుతోంది. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. పసుపు, కుంకుమ, చీరసారె, ఎత్తు బంగారం, ఒడిబియ్యం, కానుకలు సమర్పించారు. మొక్కుల అనంతరం మేడారం పరిసర ప్రాంతాల్లో విడిది చేసి వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు ఆరగించారు. ఈనెల 19న తిరుగువారం పండుగ నిర్వహించేందుకు పూజారులు సిద్ధం అవుతున్నారు. జాతర అనంతరం కూడా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మినీ జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను తిరుగువారం పండుగ తరువాత అధికారులు లెక్కించనున్నారు.



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

భక్తులకు మెరుగైన వైద్యసేవలందించాం

డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు

ములుగు : మినీ మేడారం జాతరలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు 3,197 మంది భక్తులకు ఉచిత వైద్యసేవలు అందించినట్లు డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు తెలిపారు. వైద్యశిబిరాల నిర్వహణపై సోమవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో వైద్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనెటీగలు కుట్టిన వారికి, తేలు కుట్టిన, కోతులు, కుక్కలు కరిచిన వారికి 602 మంది ఇన్‌పేషెంట్లకు మెరుగైన చికిత్స అందించామని అన్నారు. మినీ జాతర సక్సెస్‌కు 100 శాతం కృషి చేసిన ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బంది, డాటా ఎంట్రీ ఆపరేట్లరకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రణధీర్, కమ్యూనిటీ హెల్త్ అధికారి పూర్ణసంపత్‌రావు, డెమో సంపత్, ఎస్‌ఓ స్వరూపారాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి స్క్రీనింగ్

ఆర్బీఎస్‌కే ఆధ్వర్యంలో సోమవారం ఏరియా ఆస్పత్రిలో విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ హాజరై రోజుకు 100 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ చేపట్టాలని సూచించారు. మొదటి, రెండు విడతల్లో ఆశ్రమ, బీసీ, ఎస్సీ, ట్రైబల్, మైనార్టీ వెల్ఫేర్, కస్తూర్బాగాంధీ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించగా 1,427 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించామని అన్నారు. ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి రణధీర్, కంటివైద్య నిపుణుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఆఫ్రీన్, వెంకటేశ్, నరహరి, నవీన్, సంపత్ పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు

పరిధికి మించి వైద్యం చేయొద్దు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్

వాజేడు : ఆర్‌ఎంపీ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని పరిధికి మించి వైద్యం చేయొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కోరం క్రాంతికుమార్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ధర్మవరంలో సోయం వినీత్‌కు వైద్యం చేసిన ఆర్‌ఎంపీ వైద్యుడి క్లినిక్‌ను తనిఖీ చేశారు, ఓపీ, రెఫర్ రిజిస్టర్లను ఇవ్వాలని కోరగా అవి రాయడం లేదని ఆర్‌ఎంపీ వైద్యుడు తెలుపడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వినీత్‌కు ఏ మందులు ఇచ్చారని ప్రశ్నించారు. ఎన్‌ఎస్ సెలైన్ పెట్టానని జోఫ్రా ఇంజక్షన్ ఇచ్చానని తెలుపడంతో కడుపునొప్పితో బాధ పడుతున్న విద్యార్థికి అలా ఎలా ఇస్తారని ఆర్‌ఎస్ సెలైన్ పెట్టాలి కదా అని ప్రశ్నించారు. ఆయన వెంట వేణు, కోటి రెడ్డి ఉన్నారు.

సిబ్బంది తప్పు లేదు

మండల పరిధిలోని పేరూరు ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సోయం వినీత్ మృతిపై ఆశ్రమ పాఠశాల సిబ్బంది తప్పు లేదని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ పోశం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి తల్లి కూడా ఆశ్రమ పాఠశాల సిబ్బంది తప్పు లేదని తెలిపినట్లు డీడీ తెలిపారు. అన్ని నివేదికలను ఐటీడీఏ పీఓ, కలెక్టర్‌కు పంపించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థి కుటుంబానికి పరామర్శ

సోయం వినీత్(13) కుటుంబాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలకు వెళ్లి విద్యార్థి జ్వరం రాక ముందు, వచ్చిన తర్వాత తీసుకున్న చర్యలపై వార్డెన్, హెచ్‌ఎం, ఏఎన్‌ఎం లను అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.



ఆర్‌ఎంపీతో మాట్లాడుతున్న క్రాంతికుమార్

లక్నవరం అడవుల్లో కార్చిచ్చు

- నాలుగు రోజులుగా కాలుతున్న అడవి
- వేసవికి ముందే అగ్ని ప్రమాదాలు

గోవిందరావుపేట: వేసవి కాలానికి ముందే లక్నవరం అడవులు అగ్నికి ఆహుతవుతున్నాయి. మూడు రోజులుగా మండలంలోని లక్నవరం అటవీ ప్రాంతంలో అడవులకు నిప్పు అంటుకొని కాలిపోతుంది. టూరిస్టు ప్రాంతమైన లక్నవరం సరస్సు మత్తడి ప్రదేశం నుంచి తూముల వరకు అడవి కాలిపోయింది. ఎండలు ముదురుతున్న సమయంలో ఆకులు రాలుతుండడం నిప్పుకు తోడవుతున్నాయి. అకస్మాత్తుగా మంటలు వ్యాప్తి చెందుతుండటంతో విలువైన అటవీ సంపదకు నష్టం వాటిల్లుతుంది.

నివారణ చర్యలు చేపట్టినా..

అడవుల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగానే మంటలు చెలరేగి కార్చిచ్చు వ్యాపించేందుకు కారణమవుతుంది. చిన్నపాటి మంటలుగా ఉన్నప్పుడు ఎవరు గమనించకపోవడంతో కార్చిచ్చులు వ్యాపిస్తున్నాయి. నిరంతర నిఘా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మంటలు ఏర్పడిన సమయంలో ఫైర్ బ్లోయర్ మిషన్స్, చెట్ల ఆకుల సహాయంతో మంటలు ఆర్పే అవకాశం ఉంది. కానీ సకాలంలో ప్రమాద స్థలానికి చేరుకోకపోవడంతో నష్టం జరుగుతుంది. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నా గ్రామీణ ప్రజలకు అవగాహన లేకుండా పోయింది.

కాంట్రాక్టర్ల పనేనా..

తునికాకు సేకరణ కాంట్రాక్ట్‌ను దక్కించుకునే కొందరు కాంట్రాక్టర్లు సరికొత్త ఎత్తుగడలు వేస్తూ అడవులకు నిప్పు పెడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. తునికాకు సేకరణకు ముందు అడవుల్లో కూలీలతో కొమ్మకొట్టడం చేయాలి. దీంతో కూలీలను నియమించుకుంటే ఖర్చు భారం పెరుగుతుందన్న ఉద్దేశంతో కొందరు కాంట్రాక్టర్లు రహస్యంగా అడవులకు నిప్పు పెడుతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా చేయడంతో తునికాకు చెట్ల మొదలు కాలి ఆకు ఇగురు రావడంతో కలిసి వస్తుంది. కాంట్రాక్టర్ల స్వలాభం కోసం అటవీ సంపద తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.



లక్నవరం మత్తడి ప్రదేశంలో ఉన్న గుట్ట వద్ద కాలుతున్న అడవి



లక్నవరం అడవిలో కాలుతున్న వృక్షం



తూముల వద్దకు వెళ్తున్న దారిలో కాలిన అడవి

మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తున్నాం..

లక్నవరం అడవిలో రెండు, మూడు రోజులుగా అగ్నిప్రమాదం జరిగి మంటలు వ్యాప్తి చెందుతున్నాయి. సిబ్బందితో కలిసి మంటలు ఆర్పుతున్నాం. అదుపులోకి వస్తున్నాయి. మంటలు ఆర్పే క్రమంలో మా బీట్ ఆఫీసర్‌కు చెయ్యి విరిగింది. అగ్ని ప్రమాదాల నివారణపై ఇప్పటికే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాం.

- మాధవీ శీతల్, ఎఫ్‌ఆర్‌ఓ, పస్రా

'పది'లో నూరుశాతం ఉత్తీర్ణత పొందాలి

ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలోని పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత పొందాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట,, ఎస్ఎస్ తాడ్వాయి, వాజేడు మండలాల్లోని అన్ని ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో సోమవారం పీఓ సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ ఫలితాలు, సీఆర్‌టీ, ఉపాధ్యాయులకు రాష్ట్రంలో అత్యధిక శాతం ఇక్కడి నుంచి ఫలితాలను రావాలన్నారు. విద్యార్థులు, బోధనేతర సిబ్బంది, బోధనా సిబ్బందికి వైద్య పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు. పరీక్షకు సంబంధించిన మెటీరియల్ ఆల్ ఇన్ వన్ మెటీరియల్, అభ్యాసం, కరదీపికలు అందించాలన్నారు.

అత్యవసర మరమ్మతులు

విద్యాసంస్థల్లో ఏదైనా మరమ్మతులు అవసరం ఉన్నా, తల్లిదండ్రులతో సమన్వయం, ఇతర సమస్యలను ఐటీడీఏ డీడీ దృష్టికి తీసుకురావాలని హెచ్‌ఎంలు, హెచ్‌డబ్ల్యూఓలను పీఓ ఆదేశించారు. బోధన, బోధనేతర సిబ్బంది వారి సంస్థల్లో కోఆర్డినేషన్ సమావేశం ఏర్పా టు చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవా లన్నారు. డీడీ పోచం, ఏటీడీఓ క్షేత్రయ్య, జీసీడీఓ సుగుణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

క్లుప్తంగా

ముగిసిన చదరంగం పోటీలు



వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాలబాలికల ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు సోమవారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో విజేతగా అల్లాడి శ్రీవాత్సవ్, తర్వాతి స్థానాల్లో మ్యాకల శ్రీకాంత్, తుర్క రాజు, రవీంద్రనాథ్, తిరుపతిచారి, ఆద్య, సుదీప నిలిచారు. విజేతలకు నిర్వాహకుడు పి. కన్నా సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, రజనీకాంత్, శ్రీకాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన కేసులో వ్యక్తికి ఏడాది జైలు



చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి శివారు దేవోజీతండాలో ఓ ఇంట్లో చోరీకి యత్నించిన కేసులో నిందితుడికి తొర్రూరు మేజిస్ట్రేట్ మట్ట సరిత ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం తేనెపల్లికి చెందిన శివర్ల కోటేశ్ 2023లో దేవోజీతండాకు చెందిన ధర్మసోత్ భూపాల్ నాయక్ ఇంటిలో చోరీకి యత్నించాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కోటేశ్‌పై కేసు నమోదు చేశారు. సోమవారం కేసు విచారణ అనంతరం తొర్రూరు మేజిస్ట్రేట్ మట్ట సరిత.. నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. కాగా, నిందితుడికి శిక్షపడేలా విధులు నిర్వర్తించిన కోర్టు పీసీ మధును తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్, మరిపెడ సీఐ రాజ్‌కుమార్, చిన్నగూడూరు ఎస్సై ఝాన్సీ అభినందించారు.

రూ.38,720 విలువైన గుట్కాలు స్వాధీనం



ఖిలా వరంగల్: అక్రమంగా గుట్కాలు విక్రయిస్తున్న కిరాణా వ్యాపారిపై కేసు నమోదు చేసి రూ. 38,720ల విలువైన ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు. వరంగల్ 36వ డివిజన్ చింతల్‌కు చెందిన కిరాణా షాపు నిర్వాహకుడు చిదిరాల సుమన్ అక్రమంగా గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సోమవారం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో షాపుపై దాడి చేశారు. ఇందులో రూ. 38,720 విలువైన గుట్కాప్యాకెట్లు లభించగా స్వాధీనం చేసుకుని సుమన్‌పై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కేసును మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్.. ఆగమాగం!

ట్రైన్ పాస్‌లు, పీటీఓలు, లీవ్‌లు ఆన్‌లైన్‌లో మంజూరు

- వినియోగించుకోలేకపోతున్న 70 శాతం మంది రైల్వే కార్మికులు
- ఆఫ్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచాలని విన్నపం
- రైల్వే నాయకులు పట్టించుకోవాలని మొర



కాజీపేట రూరల్: ఎన్నో ఏళ్ల ఎందరో త్యాగాలు, ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న రైల్వే కార్మికుల హక్కులు పూర్తి స్థాయిలో కార్మికులు అందుకోలేకపోతున్నారు. ఇప్పటికే రైల్వే కార్మికుల హక్కులు చాలా వరకు కనుమరుగవ్వగా.. కొన్నింటి కోసం ఇప్పటికీ కార్మికులు, నాయకులు ఉద్యమిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో కొంత కాలంగా రైల్వే శాఖలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల కనీస హక్కులను ఆన్‌లైన్ చేయడంతో వాటిని సరిగ్గా వినియోగించుకోలేకపోతున్నామని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సక్రమంగా స్మార్ట్‌ఫోన్ ఆపరేట్ చేయడం తెలియని 70 శాతం మంది రైల్వే కార్మికులు ఆన్‌లైన్‌లో తమ హక్కులను ఎలా వినియోగించుకోవాలో తెలియక ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది.

ఆన్‌లైన్ చేసినవి ఇవే..



రైల్వే కార్మికులకు తమ కుటుంబసభ్యులతో కలిసి ప్రయాణించేందుకు సంవత్సరానికి మూడు ఉచిత ప్రివిలేజ్ ట్రైన్ పాస్‌లు ఇచ్చేది. అత్యవసర పరిస్థితులున్నప్పుడు, సెలవుల కోసం అర్జీ పెట్టుకుంటే సెలవులు ఇస్తారు. అదేవిధంగా క్యాజువల్ లీవ్ (సీఎల్) మంజూరు, ప్రివిలేజ్ టికెట్ ఆర్డర్ (పీటీఓ) మంజూరు ఇవన్నీ... రైల్వే ఆన్‌లైన్ చేయడం వల్ల చాలా వరకు రైల్వే కార్మికులు తమ హక్కులను పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ సిస్టంలో అప్లయ్, అప్‌లోడ్, ఓటీపీ, ఫార్వర్డ్, డౌన్‌లోడ్ విధానం తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ తెలియక..



ప్రివిలేజ్ పాస్ తీసుకునే విధానం తెలియక కొందరు కొంత కాలం నుంచి ట్రైన్‌పాస్‌లు తీసుకోవడం లేదని కార్మికులు చెబుతున్నారు ఆన్‌లైన్‌లో ట్రైన్ పాస్ ద్వారా ఒక సారి ప్రయాణం చేస్తే మరొకసారి ప్రయాణం చేసే అవకాశం లేకుండా పోయిందని, గతంలో సంవత్సరానికి మూడు ప్రివిలేజ్ ట్రైన్ పాస్‌లు ఇచ్చేవారని, ఈ పాస్‌లపై ఎన్నిసార్లు అయిన ప్రయాణించే అవకాశం ఉండేదని అంటున్నారు. ముఖ్యంగా కింది స్థాయి గ్రూప్ డి, నాలుగో తరగతి రైల్వే కార్మికులు గ్యాంగ్‌మెన్లు, గ్యాంగ్ ఉమెన్లు, గేట్‌మెన్లు, కీ మెన్లు, అటెండర్లు, డీజిల్ షెడ్, ఎలక్ట్రిక్‌లోషెడ్, ట్రైన్‌లైటింగ్, సిఅండ్‌డబ్ల్యూ స్టాఫ్, టీటీ మిషన్ స్టాఫ్ తదితర కార్మికులు ఆన్‌లైన్‌లో తమ హక్కులను పొందలేకపోతున్నట్లు పేర్కొంటున్నారు. రిటైర్డ్ రైల్వే వారికి ఇస్తున్న మాదిరిగానే సర్వీస్‌లో ఉన్న వారికి కూడా మ్యాన్యువల్‌గా ఇస్తే ఇబ్బంది ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రైల్వే ట్రేడ్ యూనియన్ల నాయకులు రైల్వే కార్మికుల కనీస హక్కులను ఆన్‌లైన్‌లో కాకుండా పాత పద్ధతిలో అమలు చేసేలా రైల్వే బోర్డు, జీఎం దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆన్‌లైన్ పాస్‌లు ఎత్తివేయాలి..



కార్మికులు తమ ఇంటిల్లిపాదితో కలిసి ఉచిత ట్రైన్‌పాస్‌తో ప్రయాణించేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ చేయడం వల్ల ఆ అవకాశం లేకుండాపోయింది. అత్యవసర సెలవులకు సీఎల్ కార్డు చూపిస్తే లీవ్ ఇచ్చేవారు. ఇప్పుడు ఆ సిస్టం లేదు. రైల్వే కార్మికుల ఇబ్బందులు గుర్తించి అధికారులు ఆన్‌లైన్ సిస్టం ఎత్తివేసి మ్యాన్యువల్ అమలు చేస్తే బాగుంటుంది.

- దేవులపల్లి రాఘవేందర్, తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్

పర్యాటకులకు గుడ్‌న్యూస్..

- ఒక్క రోజు పర్యాటక ప్రాంతాల సందర్శన
- టూర్ ఏర్పాటు చేసిన తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ





హన్మకొండ : పర్యాటకులను ప్రోత్సహించేందుకు తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఒక్క రోజు పర్యాటక ప్రాంతాల సందర్శన టూర్‌ను ఏర్పాటు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను కలుపుతూ ఈ టూర్ ప్యాకేజీ రూపొందించారు. మినీ ఏసీ బస్సులో పర్యాటకులను తీసుకెళ్లేలా టూర్ ప్యాకేజీ తీసుకొచ్చారు. ఈ నెల 20 ఉదయం 8 నుంచి రాత్రి 7.45 గంటల వరకు సాగుతోంది. గురువారం ఉదయం 8 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ నుంచి ఈ పర్యాటక ప్రాంతాల సందర్శన ప్రారంభమవుతుంది. ముందు వేయిస్తంభాల దేవాలయానికి చేరుకుంటారు. 9 గంటలకు వేయి స్తంభాల దేవాలయం నుంచి భద్రకాళి దేవస్థానానికి, ఇక్కడి నుంచి రామప్పకు చేరుకుంటుంది. రామప్పలో మధ్యాహ్న భోజన అనంతరం లక్నవరం నుంచి నేరుగా సాయంత్రం 5.30 గంటలకు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు చేరుకుంటారు. తేనీరు తీసుకున్న తర్వాత ఖిలావరంగల్‌కు చేరుకుని సౌండ్ లైటింగ్ కార్యక్రమాన్ని వీక్షించడంతో పాటు, ఖిలావరంగల్‌లోని పర్యాటక ప్రాంతాలను సందర్శించి తిరిగి రాత్రి 7.45 గంటలకు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు చేరుకోవడంతో పర్యటన ముగుస్తుంది. వివరాల కోసం 9010007261 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పర్యాటకాభివృద్ధి సంస్థ ఒక ప్రకటనలో కోరింది. సంస్థ వెబ్ సైట్ లోనూ వివరాలు పొందుపరిచినట్లు తెలిపింది. చార్జీలు పెద్దలకు రూ.980, పిల్లలకు రూ.790గా నిర్ణయించారు.

రామప్ప శిల్పకళ అద్భుతం

- రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా



దీజీ సౌమ్యమిశ్రాకు ఆలయ విశిష్టతను వివరిస్తున్న గైడ్ విజయ్‌కుమార్

వెంకటాపురం(ఎం): రామప్ప శిల్పాకళా సంపద అద్భుతమని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని సందర్శించి రామలింగేశ్వర స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా, ఆలయ అర్చకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించిన సమయంలో రామప్ప ఆలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. యునెస్కో గుర్తింపు పొందిన తర్వాత ప్రస్తుతం రామప్ప ఆలయాన్ని మళ్లీ సందర్శించినట్లు వెల్లడించారు. ఆమె వెంట ఓఎస్‌డీ మహేశ్ భగవత్ గీతె, ములుగు డీఎస్పీ రవీందర్, జైళ్ల శాఖ అధికారులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ..

- ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణ
- మహబూబాబాద్‌లో ఘటన



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు, భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు అపహరణకు గురయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ కాలనీలో నివాసముండే ఆళ్లపాటి శ్యామలాదేవి తన అన్న కొడుకు పెళ్లి నిమిత్తం ఈ నెల 14వ తేదీన హైదరాబాద్ వెళ్లింది. ఈ నెల 16వ తేదీన సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉంది. బెడ్ రూంలోని రెండు బీరువాల తలుపులు పగులగొట్టి అందులో భద్రపరిచిన ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు, భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై శ్యామలాదేవి మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హస్తినాపురం కాలనీలో నివాసం ఉండే రాజేశ్వర్ రావు, విద్యావతి దంపతులు ఆదివారం ఉదయం ఖమ్మం జిల్లా బీఎం.బంజర గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో దుండగుడు చోరీకి పాల్పడడానికి ఆ ఇంటి తలుపులు, తాళాలు తొలగించేందుకు యత్నించాడు. వీలుకాకపోవడంతో వంట గది తలుపులు కాలబెట్టాడు. పొగలు వస్తుండగా స్థానికులు గమనించి ఘటనాస్థలికి వెళ్తుండగా వారిని చూసి దుండగుడు పరారయ్యాడు. స్థానికులు వెంటనే ఇంటి యజమానికి సమాచారం ఇచ్చి మంటలు ఆర్పారు. సకాలంలో స్పందించి చోరీని నివారించడంతోపాటు మంటలను ఆర్పి పెద్ద ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు.

వ్యవసాయ మోటార్ల కాపర్ వైర్..




వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై రియాజ్‌పాషా

గార్ల: రైతులకు చెందిన ఐదు వ్యవసాయ మోటార్లను దొంగలు ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైర్ ఎత్తుకెళ్లినట్లు ఎస్సై రియాజ్‌పాషా సోమవారం తెలిపారు. గార్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన బానోత్ హనుమంతు, భీముడు, కిషన్, భీమ్యా, రాములుకు చెందిన వ్యవసాయ మోటార్లను దొంగలు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్ ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు హనుమంతు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలిని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రియాజ్‌పాషా పేర్కొన్నారు.

పోడు భూముల్లో సౌర వెలుగులు

- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 500 ఎకరాల సేకరణపై దృష్టి
- ఇప్పటికీ 300 ఎకరాలు సేకరణ
- 'పీఎం కుసుమ్' ద్వారా గిరిజనులకు ప్రోత్సాహం
- మహిళలకు ఆదాయ వనరుగా మలిచేందుకు చర్యలు



ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల వివరాలు

జిల్లా	రైతుల సంఖ్య	ఎకరాలు
వరంగల్	5,117	12,443
హనుమకొండ	70	65
ములుగు	12,343	32,694
భూపాలపల్లి	4,597	10,379
మహబూబాబాద్	29,877	90,323
మొత్తం	52,004	1,45,904



మహబూబాబాద్‌లో పోడు భూములను పరిశీలిస్తున్న 'పెసా' కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, రైతులు, రెడ్కో సంస్థ ప్రతినిధులు

ఏటూరునాగారం: పోడు భూముల్లో సోలార్ వెలుగులు నిండనున్నాయి. సాగుకు యోగ్యంగా లేని పోడు భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసి గిరిజనుల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాయి. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్(పీఎం కుసుమ్) పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయబోతుంది. ఈ నేపథ్యంలో ఐటీడీఏ పరిధిలోని 500 ఎకరాల హక్కు పత్రాలు కలిగిన పోడు భూములు, ఆర్ ఓఎఫ్ఆర్ పట్టా, రెవెన్యూ పట్టా కలిగిన భూములు సేకరించాలని ప్రభుత్వం లక్ష్యం విధించుకుంది. దీని ద్వారా ఐటీడీఏ పరిధిలో గిరిజన రైతుల భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. ఒక్కో రైతు వద్ద 4 ఎకరాల వరకు సేకరించి ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. అంతేకాకుండా రైతులను గుర్తించడానికి ఇప్పటికే పెసా మొబిలైజర్లను గ్రామాల వారీగా వెళ్లి రైతులకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఐటీడీఏ పరిధిలో గోవిందరావుపేట, మంగపేట, వెంకటాపురం, కన్నాయిగూడెం, ఖానాపురం, కొత్తగూడ మండలాల గిరిజన రైతుల నుంచి 300 ఎకరాల భూమి సేకరించారు.

నిర్వహణ బాధ్యత మహిళా సంఘాలకే

కేంద్ర ప్రభుత్వం 2019లో ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో సోలార్ ప్లాంట్లు నెలకొల్పింది. అదే తరహాలో రాష్ట్రంలో సుమారు 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ఈ ప్లాంట్లు నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం విధించుకుంది. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు 5 కిలోమీటర్ల దూరం లోపు ఉన్న పోడు భూములు, ఆర్ ఓఎఫ్ఆర్, రెవెన్యూ భూముల్లో సోలార్ ప్లాంట్లు నెలకొల్పి వీటి నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించనున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు దగ్గర ఉన్న ప్లాంట్‌లో సోలార్ సిస్టమ్‌ను రెడ్కో సంస్థ ద్వారా నిర్మించనున్నారు. నిర్మించిన ప్లాంట్లను మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయించి సరఫరాను సబ్ స్టేషన్‌కు అందజేసి ఇస్తే ఒక్క యూనిట్‌కు రూ.6ను సంఘానికి చెల్లిస్తారు. అయితే ఈ ప్లాంట్లకు భూములు ఇచ్చిన వారికి ఒక్కో ఎకరానికి రూ.12,500 ఏడాదికి అందించనున్నారు. 25 సంవత్సరాలకు అగ్రిమెంట్ కాగా 15 సంవత్సరాలకు సంఘాల అగ్రిమెంట్ చేయనున్నారు. దీంతో గిరిజన రైతులు, మహిళలకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాధికారత చేకూరనుంది.

భూముల గుర్తింపులో వేగం పెంచాం



సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం భూములు గుర్తించే విషయంలో వేగం పెంచాం. జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల్లో కూడా పెసా మొబిలైజర్ల ద్వారా రైతులకు అవగాహన కల్పించి భూముల సేకరణ చేపడుతున్నాం. ప్లాంట్లకు అనువైన ప్రదేశాలను గుర్తించే పనిలో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. దీంతో రైతులు, మహిళలకు మరింత ఆదాయం కలగనుంది.

- చిత్రామిశ్రా, ఐటీడీఏ పీఓ, ఏటూరునాగారం

భూములు పరిశీలిస్తున్నాం..

వ్యవసాయానికి అనుగుణంగా లేని పోడు భూములు, విద్యుత్ సబ్‌స్టేషన్ కు దగ్గర ఉన్న భూములను పరిశీలిస్తున్నాం. పోడు భూముల రైతులకు అవగాహన కల్పించి వారి వద్ద నుంచి అనుమతి పత్రాలు కూడా తీసుకుంటున్నాం. ప్లాంట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాం.

- కొమురం ప్రభాకర్, పెసా కోఆర్డినేటర్, ఏటూరునాగారం

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

- వనమాల కనపర్తిలో ఘటన



రాజేశ్(ఫైల్)

ఐనవోలు: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గట్టు రాజేశ్(41) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండు సంవత్సరాల క్రితం గ్రామంలో ఇంటి నిర్మాణం మొదలు పెట్టాడు. కాగా, చిట్టీలు ఎత్తుకోవడంతోపాటు కొంతమంది వద్ద సుమారు రూ.8లక్షల వరకు అప్పులు చేశాడు. అదే విధంగా భార్య సునీత బంగారం సుమారు 7 తులాల వరకు బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం పొందాడు. ఇటీవల అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నాడు. అప్పులు ఎలా తీర్చాలని తరచూ బాధపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఒక్కడే నిద్రించాడు. సోమవారం ఉదయం భార్య సునీత కొత్త ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని చనిపోయి కనిపించాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కాగా, మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఐశ్వర్య, సంజన ఉన్నారు.

దుప్పిని ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం



ప్రాణాపాయస్థితిలో ఉన్న దుప్పి

కాళేశ్వరం: మహదేవపూర్–కాళేశ్వరం ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పికి గాయాలయ్యాయి. సోమవారం రాత్రి అడవి నుంచి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని దుప్పికి గాయాలై ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతుంది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు.

వంద క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చెన్నారావుపేట: అక్రమంగా నిల్వ చేసి వంద క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం మండలంలోని పాత మగ్దుంపురం గ్రామంలోని ననుమాస పవన్‌కుమార్ ఇంటిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఇందులో వంద క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యంకాగా స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు పేర్కొన్నారు. నిల్వ చేసిన రేషన్ బియ్యం విలువ సుమారు రూ. 2 లక్షల 50 వేలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

24 కిలోల గంజాయి స్వాధీనం



దోర్నకల్ : నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్‌లో హరప్రసాద్ సాహూ అనే వ్యక్తి వద్ద సుమారు రూ.6లక్షల విలువైన 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కోదల గ్రామానికి చెందిన హరప్రసాద్ సాహూ సోమవారం గంజాయితో వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగి క్రయవిక్రయదారుల కోసం వేచి ఉన్నాడు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో అతడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు.

దోర్నకల్‌లో 19.68 కేజీలు..

దోర్నకల్ : దోర్నకల్ మండలం ఉయ్యాలవాడ క్రాస్ వద్ద సోమవారం పోలీసులు ఎండు గంజాయి పట్టుకున్నారు. ఎస్సై గడ్డం ఉమ కథనం ప్రకారం.. ఉయ్యాలవాడ క్రాస్ వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై నలుగురు వ్యక్తులు వస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని ఆపి తనిఖీ చేయగా 19.68 కేజీల ఎండు గంజాయి లభించింది. దీంతో ఒడిశాకు చెందిన సమర భూమియా, సీసీఎల్, మహదేవ్ మండల, ఉమేశ్ మండలను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.4,92,000 ఉంటుందని ఎస్సై తెలిపారు.

నేడు అగ్రిహబ్ రీజినల్ సెంటర్ ప్రారంభం

హన్మకొండ: వరంగల్ పైడిపల్లిలోని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏర్పాటు చేసిన అగ్రిహబ్ రీజినల్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించనున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వ్యవసాయ యూనివర్సిటీ వీసీ ఎ.జానయ్య ప్రారంభిస్తారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయంలో స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించడానికి ఈ అగ్రిహబ్‌ను ఇక్కడ స్థాపించినట్లు వివరించారు.